# ఆవేశం నిలిచి ఉంది

మద్రాసు నుంచి బయలుదేరిన సర్కార్ ఎక్స్‌ప్రెస్ విజయవాడ స్టేషనుకు వచ్చి ఆగింది.

ప్లాట్‌ఫారమ్ మీద జనం అంతగా లేరు. అంతగా ఏమిటి? అసలు లేరనే చెప్పాలి. రైల్వే పనివాళ్ళు చేసిన సమ్మె ఫలితమో, ఆషాఢమాసం కావటానో, రైలు వచ్చిన వేళా విశేషమో, లేక ప్రజలు ప్రయాణాలు మానుకున్నారో!

మద్రాసునుంచి వచ్చిన టూ టయర్ కంపార్ట్‌మెంట్ కండక్టర్ మరో కండక్టర్‌కు ఛార్జి ఇచ్చి వెళ్ళిపోయాడు. మొత్తం టూ టయర్ కంపార్ట్‌మెంట్‌లో నలభై సంవత్సరాల కిరణ్మయి, ఆమె భర్త కరుణాకర్ మాత్రమే ఉండటంతో బోసిపోయినట్టుగా ఉంది పెట్టె.

రైలు కదలబోయే సమయంలో తన పొడుగాటి గడ్డాన్ని సవరించుకుంటూ గబగబ ఎక్కాడు హరిరావు టూ టయర్ కంపార్ట్‌మెంటులో.

హరిరావును చూడగానే 'నమస్కారం, సార్' అన్నాడు కండక్టర్ ఆనంద్.

అతనికి ప్రతినమస్కారం చేసి పెట్టె అంతా తిరిగి కరుణాకర్ కూర్చున్న బెంచీకి చివరగా కూర్చున్నాడు హరిరావు.

రైలు కదలటంతో కండక్టర్ ఆనంద్ టికెట్స్ చెక్ చేయటానికని రిజర్వేషన్ ఛార్టు తీసుకొని కరుణాకర్ వద్దకు వెళ్ళాడు. అక్కడే కిటికీ పక్కగా కూర్చున్న హరిరావుతో —"ఏం సార్! రిటైరయినా మీ కీ ప్రయాణాల సరదా తీరలేదా?" అన్నాడు ఆనంద్.

అతని మాటలు వినిపించుకోకుండా జేబులోనుంచి అర్ధ రూపాయి తీసి తన సీజన్ టికెట్టుతోబాటు ఆనంద్ చేతిలో పెట్టాడు హరిరావు.

'ఏమిటో!' తనలో తనే అనుకుంటూ హరిరావుకు రసీదు వ్రాసి ఇచ్చాడు ఆనంద్.

కరుణాకర్ తమ టికెట్లు ఆనంద్‌కి అందిస్తూ వింతగా కనిపిస్తున్న హరిరావును చూశాడు.

హరిరావు పెట్టెలోని మిగతావారితో సంబంధం లేనట్టు పరుగెడుతున్న ఇళ్ళను, టెలిఫోన్ స్తంభాలను రైలు పెట్టెలో నుంచి చూస్తున్నాడు.

'ఎవరాయన?' అన్నట్టు చూశాడు కరుణాకర్, ఆనంద్ కళ్ళలోకి.

కరుణాకర్ ఉద్దేశాన్ని గ్రహించిన ఆనంద్ — "ఆయన హరిరావుగారని మా రైల్వే ఎంప్లాయి. రిటైరయి ఆరు నెలలవుతుంది. నాలాగనే కండక్టర్‌గా పనిచేసే వారు. నిజాయితీ పరుడుగా ఆయనకు చాలా మంచి పేరుంది. ఆయనంటే రైల్వే పనివారందరికీ ఎంతో గౌరవం. ఎందువల్లనో ఎవరికీ తెలియదు — మేం చెప్పవలసిందిగా ఆయన్ని ఎప్పుడూ బలవంతం చేయలేదనుకోండి — తన సర్వీసులో చాలా భాగం ఇదే ట్రెయిన్‌లో కండక్టర్‌గా పని చేశారు. వేరే డ్యూటీ వేసినా ఈ ట్రెయిన్‌కు మార్పించుకొనేవారు. ఒకవేళ అది కుదరకపోతే టిక్కెట్టు కొనుక్కొని మరీ విజయవాడలో ఈ ట్రెయిన్ ఎక్కి గుడివాడ వరకు వెళ్ళేవారు. రైలు దిగగానే గుడివాడలో దిగిన వారందరినీ చూస్తూ గేటులో నించునేవారు. రిటైర్ అయినా, ఆయన సీజన్ టికెట్టు తీసుకొని రోజూ ఈ ట్రెయిన్‌లో ఉదయం గుడివాడ వెళ్ళటం, సాయంత్రం విజయవాడకు తిరిగి రావటం చేస్తూనే ఉన్నారు. 'సీటుకు రిజర్వేషన్ ఛార్జి వద్దులెండి. మీరు మీ ఇష్టమొచ్చిన సీట్లో కూర్చోండి' అన్నా వినరు. తప్పక అర్ధరూపాయి ఇచ్చి సీటును రిజర్వు చేసుకుంటారు" అన్నాడు ఆనంద్, కరుణాకర్‌కు టికెట్టును తిరిగి ఇచ్చివేస్తూ.

కరుణాకర్‌కి చిత్రంగా హరిరావు


జీవితంలో ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగించే అనేక మధుర క్షణాలుంటాయి



తలనొప్పి మూలంగా మీ ఆనందాన్ని పాడుచేసుకోవద్దు

2 ఆస్ప్రో తీసుకోండి

మైక్రోఫైన్ ఆస్ప్రో నొప్పిని అతిశీఘ్రంగా తొలగించును

ASPRO Nicholas

A.G.62.11

## కిరణ్ కుమార్



జీవితంలో ఏదో తెలుసుకోదగినది ఉందని అనిపించింది.

ఆనంద్ వెళ్ళిపోవటంతో హరిరావునే చూస్తున్న భర్తను చూసి, "ఆయన్ని మాట్లాడించనా?" అని అడిగింది కిరణ్మయి.

"నీ ఇష్టం" అన్నాడు కరుణాకర్.

"బాబాయిగారూ, ఎందాకా ప్రయాణం?" కాళ్ళకున్న పాతబూట్లను విప్పుకుంటూన్న హరిరావును పలకరించింది కిరణ్మయి.

"ఏమన్నావమ్మా?"

"ఎందాకా ప్రయాణం!" మళ్ళీ అడిగింది కిరణ్మయి.

"ఎంతదాకా! అన్నావు అనుకున్నా."

"పోనీ, ఎంతదాకానో చెప్పండి."

"అదే తెలిస్తే ఈ ప్రయాణం ఎప్పుడో మానేసే వాణ్ణమ్మా. అది తెలియకే ఈ బొందిలో ప్రాణం ఇంకా మసలుతూంది."

"మీరేదో ఆవేదనతో మాట్లాడుతున్నారు."

"ఆవేదనేముందమ్మా! ఆరాటం ఉన్నదేమో?"

"దేన్ని గురించి బాబాయిగారూ, మీ ఆరాటం?"

"అది చెబితే తీరేది కాదమ్మా. ఇలా తపిస్తూ బ్రతకవలసిందే అనిపిస్తూంది."

"మీ ఆరాటం పూర్తిగా తీరకపోవచ్చునుగానీ, కొంత ఊరట కలగవచ్చుగా?"

"అది చాలా పెద్ద కథలాంటిదమ్మా. చెబితే మీకు నవ్వు రావచ్చు. నన్ను వెర్రివాడని అనుకోవచ్చు."

"ఛ ఛ! ఎంత మాటన్నారు, బాబాయిగారూ! మిమ్మల్ని గురించి అలా అనుకుంటే మేం పిచ్చివాళ్ళమన్న మాట."

"... ..."

"సంకోచించకండి. తెలుసుకోవాలని మాకు చాలా కుతూహలంగా ఉంది."

కిరణ్మయిని, కరుణాకర్‌ని మార్చి మార్చి చూస్తూ, "సరే. చెబుతాను. వినండమ్మా" అంటూ చెప్పడం ఆరంభించాడు హరిరావు.

"ఇరవై సంవత్సరాల క్రిందటిమాట. అప్పుడు ఈ సర్కార్ ఎక్స్‌ప్రెస్ ఉండేది కాదు. గుంటూరు — బందరుల మధ్య ఇదే టైములో ఒక ఎక్స్‌ప్రెస్ నడిచేది. సర్కార్ ఎక్స్‌ప్రెస్ గుడివాడ—భీమవరం మీదుగా వేయటంతో దాన్ని రద్దు చేశారు. ఆ ఎక్స్‌ప్రెస్‌లో నేను ట్రావెలింగ్ టికెట్ ఇన్స్పెక్టర్‌గా పనిచేస్తూ ఉండేవాణ్ణి. ప్రతి రోజు ఉదయాన్నే

ఒక అమ్మాయి — సుమారుగా ఇరవై సంవత్సరాల వయసుంటుంది, విజయవాడ స్టేషన్‌లో ఎక్కేది. ఆమె గుడివాడలో దిగేది. ఆమె అలా విజయవాడలో రైలెక్కి గుడివాడలో దిగటం నేను చాలాసార్లు చూశాను. ఒక రోజున రైలు కదలబోతూండగా ఆమె రైలు ఎక్కటం, నేను టికెట్లు చెక్ చేస్తూ ఆమె వద్దకు రావటం, ఆమె తాను ఆ రోజున ఆలస్యంగా స్టేషన్‌కు రావటాన టిక్కెట్టు కొనుక్కోకుండా రైలెక్కాననీ, పెనాల్టీతోబాటు డబ్బు కడతాననీ అనటం జరిగింది. ప్రతిరోజూ టికెట్టు కొనుక్కునే ఆ అమ్మాయి ఆ రోజున కొనక పోవటానికి కారణం చెప్పటాన, నేను ఆవిడ దగ్గర మామూలు టికెట్టుకు మాత్రమే ఛార్జి చేశాను. అందుకు ఆవిడ ఎంతో ఆనంద పడింది. ఆ రోజుల్లో రూల్సు ఇప్పటిలా స్ట్రిక్టుగా లేకపోవటాన నేనలా ఛార్జి చేయగలిగాను. ఆ రోజు నుంచీ ఆమెను నేను రోజూ పలకరించటం, ఆమెకూడా చాలా కలుపుగోలుగాను, స్నేహంగాను మాట్లాడటం మొదలయింది. ఏదైనా ఒక రోజున ఆమె కనిపించకపోతే నాకు ఏదోలా అనిపించేది ..."

"ఆమె చాలా అందంగా ఉండేదనుకుంటా." కిరణ్మయి తను శ్రద్ధతో వింటూన్నట్టు తెలపాలని అంది.

"అందంగా అంటే నా కళ్ళకు అలానే కనిపించేది. సన్నగా, నాజూగ్గా ఉండేది. చేతిలో చిన్న హాండ్ బాగ్, మెడలో ఒంటిపేట బంగారు గొలుసు, కుడిచేతికి బంగారు గాజుల జత, ఎడమ చేతికి గుండ్రని లేడీస్ వాచ్, ముఖాన తను కట్టుకొన్న బట్టలకు సరిపోయేట్టుగా ఉండే బొట్టు— ముచ్చటగా ఉండేది. అంతగా ఎరుపు కాకపోయినా, చామన చాయకంటె ఒక వన్నె ఎక్కువగానే ఉండేది ఆమె ఒంటి రంగు. ఆవిడ కళ్ళు పెద్దగా నక్షత్రాలలా ఉండేది ..." ఆమె రూపాన్ని గుర్తు తెచ్చుకుంటూ వర్ణించుకు పోతున్నాడు హరిరావు.

"అయితే?" తరవాత విషయం చెప్పమన్నట్టు అడిగింది కిరణ్మయి.

"ఆమెను ఒకసారి మీ పేరేమిటని అడిగాను. 'కుమారి' అని చెప్పింది. 'వివాహం కానందువల్లా?' అన్నాను. 'అంతేకాదు, పేరు కూడాను' అన్నది. ఒకటి రెండుసార్లు మే మిద్దరం కలిసి గుడివాడ స్టేషన్‌లో కాఫీ తాగటం వరకూ మా స్నేహం పెరిగింది." దీర్ఘంగా శ్వాస తీసుకుని మళ్ళీ చెప్పటం ప్రారంభించాడు హరిరావు.

"ఆ రోజు మార్చి 29 వ తారీఖు. నేను మామూలుగా ఆమెను పలకరిస్తున్న సమయానికి ఇందుపల్లి స్టేషన్ వచ్చింది. సహజంగా ఆ రైలు అక్కడ ఆగదు. స్పెషల్ స్క్వాడ్ వారు చెక్ చెయ్యటానికని రైలును అక్కడ ఆపారు. నేను ఉన్న పెట్టెలోకి వచ్చారు. నేను కలెక్టు చేసిన డబ్బును, ఇష్యూ చేసిన రసీదులతో సరి చూసుకుందామని జేబులో చూసుకునేసరికి నా జేబులో డబ్బు లేదు. రసీదు బుక్ ప్రకారం నూట ముప్ఫయి రూపాయలు నా దగ్గర ఉండాలి. ఎవరో కొట్టేశారు. జేబుదొంగలు ఎవరైనా పెట్టెలో ఉన్నారేమోనని పెట్టె అంతా గాలించాను. అటువంటి వారు ఎవరూ కనిపించలేదు. స్పెషల్ స్క్వాడ్ వారు నా రసీదు బుక్‌ను చెక్ చెయ్యటానికి తీసుకున్నారు. నేనేం చెయ్యాలో పాలుపోలేదు. కంగారు పడిపోతున్నాను. నా ఉద్యోగానికి, పరువు ప్రతిష్ఠలకి సంబంధించిన విషయం అది. నా పరిస్థితిని గ్రహించిన కుమారి 'ఏమయిం'దని అడిగింది. విషయం చెప్పాను. 'మీరేం కంగారు పడకండి. డబ్బు నే నిస్తాను. తీసుకోండి' అని తన బాగ్ లోంచి తీసి నా చేతిలో పెట్టింది. ఆమెపైన అంత వరకు నాకు గల అభిమానం ఆ క్షణాన ఆదరంగాను, ఆప్యాయతగాను మారింది. నేను ఆశ్చర్యంతోను, కాపాడినందుకు ఆనందంతోను కృతజ్ఞతలు చెప్పుకుంటూ ఆ డబ్బు తీసుకుని స్పెషల్ స్క్వాడ్ వారికి లెక్క చూపించాను. వారు దిగి వెళ్ళిపోయాక 'రేపు ఎల్లుండిలో మీ రిచ్చిన డబ్బులు తిరిగి ఇస్తా' నని ఆమెతో చెప్పాను. ఆమె 'అలాగే' నంటూ గుడివాడలో దిగిపోయింది. తరవాత మూడు రోజులు డబ్బుకోసం ఎంత ప్రయత్నించినా నాకు దొరక్కపోవటంతో నేను సెలవు పెట్టి, మొదటి తారీఖున జీతం తీసుకుని రెండవ తారీఖున నూటముప్ఫయి రూపాయలు జాగ్రత్తగా కవరులో పెట్టుకుని డ్యూటీకి వచ్చాను. ఆ రోజున ఆమె రాలేదు. ఆ తరవాత రోజూ రాలేదు. ఆ తరవాతి రోజే ఏమిటి? ఈ రోజు దాకా ఆమె రాలేదు. విజయవాడలోను, గుడివాడలోను పిచ్చిగా ఆమెకోసం తిరిగాను. ఆమె కనిపించలేదు. ఈ నాటి వరకు ఎప్పుడైనా కనిపిస్తుందేమోనని, ఈ నూటముప్ఫయి రూపాయల కవరును వెంబడి పెట్టుకుని" — జేబులోనుంచి కవరు తీసి చూపించి మళ్ళీ భద్రంగా జేబులో పెట్టుకున్నాడు — "ఆమెకోసం ఇలా ప్రయాణం చేస్తూనే ఉన్నాను. ఒంటరి జీవితాన్ని గడుపుతూ కళ్ళలో వత్తులు పెట్టుకుని ఆమెకోసం వెతుకుతున్నాను. నాకు ఈ శిక్ష నుంచి విముక్తి ఎప్పుడో తెలియటం లేదు. ఆమె ఒక్కసారి కనిపించితే చాలు, ఈ జీవితం చాలించవచ్చు. అందుకే నా ఈ ఆరాటం. ఈ ఋణం తీరే రోజు ఎప్పుడో!" కళ్ళు తుడుచుకుంటూ అన్నాడు హరిరావు.




"నిరాశచెందకండి. మీ కోరిక తప్పక ఫలిస్తుంది." అతన్ని చూస్తూ జాలిగా అన్నాడు కరుణాకర్.

"ఆ ఆశతోనే బ్రతుకుతున్నాను మాస్టారూ—అది తీరిననాడు ఈ కట్టె వదిలి నిశ్చింతగా పోతాను."

"ఛ. అవేం మాటలు, బాబాయిగారూ!" ఓదార్పుగా అంది కిరణ్మయి.

గుడివాడ స్టేషన్ రావటంతో సర్కార్ ఎక్స్‌ప్రెస్ ఆగింది. కిరణ్మయి, కరుణాకర్‌లతోబాటు హరిరావు కూడా దిగి, "వస్తానమ్మా. వస్తాను, మాస్టారూ" అంటూ ఎగ్జిట్ వైపుగా వెళ్ళాడు హరిరావు.

"ఈ నాటికీ ఇలాంటి వాళ్ళున్నారు! అందుకే ఇంకా లోకం నిలిచి ఉంది." కరుణాకర్ హరిరావు వెళుతూన్నవైపే చూస్తూ అన్నాడు.

"ఆ అమ్మాయి కనిపించి ఆమె మరొకరి భార్యగా ఎరిగిననాడు అతని గుండె పగిలిపోతుంది. అతను బ్రతకడు." కిరణ్మయి ఆలోచిస్తూ అంది.

"ఆ అమ్మాయి కనిపించాలిగా!"

"ఆమె రూపురేఖలు బాగా మారటాన నేమో కనిపించినా అతను గుర్తు పట్టలేదు."

"అంటే —" ఆశ్చర్యంగా అన్నాడు కరుణాకర్, కిరణ్మయిని చూస్తూ.

"అదే రోజున ఆమె స్టేషన్‌కు వస్తూన్న రిక్షా కారుతో ఢీకొని ఏక్సిడెంట్ కావటం, ఆ ఏక్సిడెంటులో ఆమెకు బాగా గాయాలు తగిలి మూడు నెలల పాటు మంచం మీద నుండి లేవలేక పోవటం జరిగింది."

"... ..."

"కొద్దిగా కోలుకుంటూన్న సమయంలో మీరు వచ్చి నన్ను చూడటం, 'సెలవులేదు, పదిహేను రోజుల్లో లగ్నం పెట్టించండి' అని అనటం, వివాహం జరగటం, మీతోబాటుగా నేను అంబాలా కు వచ్చేయటం వెంట వెంటనే జరిగిపోయాయి ... ఆ అమ్మాయిని నేనే అని అతనికి తెలియదు."

కరుణాకర్ అచేతనంగా కిరణ్మయిని చూస్తూ ఆగిపోయాడు. ★